క్లుప్తంగా

'బార్' ఎన్నికలకు ఆరు నామినేషన్లు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2023–24 సంవత్సరానికి ఈ నెల 17న జరిగే బార్ ఎన్నికలకు శనివారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు ఉపాధ్యక్షుడిగా సుధీన శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పాశం శంకర శ్రీనివాస్, తోకల ముసలయ్య నామినేషన్లు దాఖలు చేశారు. మహిళా కమిటీ మెంబర్లుగా పి.సూర్యకళ , జూనియర్ కమిటీ మెంబర్లు సీహెచ్. శివ కేశవరావు, ఎంఎస్ఎస్ బాబు నామినేషన్లు దాఖలు చేశారు.

5న ఛలో ఢిల్లీ



వాకాడలో ఆటో జాతా నిర్వహిస్తున్న దృశ్యం

కరప: జాతీయ ఉపాధిహామీ పథకాన్ని రక్షించుకునేందుకు ఈనెల ఐదున తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంలో ఉపాధి కూలీలందరూ పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్‌లు పిలుపు నిచ్చారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో శనివారం వాకాడ, వేములవాడ, గొర్రిపూడి, కొంగోడు గ్రామాల్లో ఆటో జాతా నిర్వహించి కరపత్రాలు పంచి కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమం గురించి, వివరించారు. నేరేడుమిల్లి త్రిమూర్తులు, చోడిశెట్టి కృష్ణ, మాతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక పోరాటంపై బైక్ ర్యాలీ

కాకినాడ సిటీ: ఈనెల 5న ఢిల్లీ కార్మిక కర్షక పోరాట ప్రదర్శన జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రాత్రి కాకినాడలో కార్మిక సంఘాలు, సీపీఎం నాయకులు బైక్ ర్యాలీ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు ఆపాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

కాకినాడ సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమంతో పాటు, ఉపాధి కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యం ఉండాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. శుక్రవారం రాత్రి యూటీఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు (ఆర్‌వీఆర్) స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'రాష్ట్ర బడ్జెట్–2023'పై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్ర పాలకులు చాలా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి కల్పనకు, అభివృద్ధి లక్ష్యాలతో బడ్జెట్ ఉంటే రాష్ట్రం వివిధ సూచికలలో అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సత్తిరాజు, ఆర్‌వీఎస్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఐ ప్రసాదరావు మాట్లాడారు. యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్ అధ్యక్షత వహించగా ఆర్.జయప్రకాష్, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రగతి'లో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంను ప్రారంభించిన కళాశాల చైర్మన్ డాక్టర్ కృష్ణారావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.దుర్గరాజు, వైద్యాధికారి పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఏటా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలతో పలువురు లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతోందని అన్నారు. వైద్య బృందం 150 మందికి ప్రాథమిక పరీక్షలు చేసి 110 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రాజశేఖర ఫణీంద్ర, డిపార్ట్‌మెంట్ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జిలు, విద్యార్థుల తరపున కో–ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

ఘనంగా ఏపీఎస్పీ స్కూల్ వార్షికోత్సవం



లఘు నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాకినాడ: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ థర్డ్ బెటాలియన్‌లోని ఇంగ్లీష్ మీడియం స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏఎస్పీ పి.శ్రీనివాస్, ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, ఏపీఎస్పీ అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ తదితరులు ముఖ్య అతిథులుగా వేడుకల్లో పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ముఖ్య అతిథి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ స్కూల్‌లో చదివినవాళ్ళు పెద్దపెద్ద ఉద్యోగాలలోను, వ్యాపారాల్లోను స్థిరపడ్డారన్నారు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే ఈ పాఠశాలలో చదవడం విద్యార్థుల అదృష్టంగా భావించాలన్నారు. సోమవారం నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలను బాగా రాయాలని టెన్త్ విద్యార్థులను కోరారు. అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపలో సంక్షేమం

- సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా పాలన
- సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు
- రూరల్ మండలంలో రూ.2.9 కోట్లతో డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం



వాకలపూడిలో డ్రైనేజీ పనులు



వాకలపూడి సాయి వీధిలో నిర్మించిన కల్వర్టు

కాకినాడ రూరల్: సంక్షేమ ఫలాలతో అందరి మన్ననలు పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వం మరో వైపు అభివృద్ధిలోనూ పరుగులు తీస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం జగన్ అధికారులతో కలసి గడపగడపకూ స్థానిక ఎమ్మెల్యేలను పంపి సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తున్నారు. అత్యధికంగా రహదారులు, డ్రైనేజీల సమస్యలనే స్థానికులు చెప్పుండడంతో ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి వచ్చిన సమస్యలు వేగంగా పరిష్కారం అయ్యేలా పనులు వేగవంతం చేశారు. రూరల్ మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ.2.9 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 91 పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 17 పనులు పూర్తయ్యాయి. వర్షాకాలంలో చిన్నపాటి చినుకులకే సిమెంట్ రోడ్లపై నీరు నిలిచిపోతుండడంతో వాకలపూడి, వలసపాకల గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. వాకలపూడి పరిధిలో మూడు, వలసపాకల పరిధిలో రెండు సచివాలయాలతో పాటు నేమాం గ్రామంలోను డ్రైనేజీలను పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాలలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీలతో ముంపు సమస్యకు మోక్షం



వాకలపూడి గ్రామంలో కోట్ల రూపాయలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. వర్షాకాలానికి ముందు పనులు చేపట్టడంతో రాబోవు రోజుల్లో ముంపు సమస్యకు మోక్షం కలుగుతుంది. గడపగడపకూ నిధులతో పాటు, పలు రకాల నిధులతో తమ గ్రామంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

– నల్లా రాణి, వాకలపూడి గ్రామం.

గడప గడపకు నిధులతో వేగంగా పనులు

గడపగడపకూ నిధులతో డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మిస్తున్నాం. ప్రజల నుంచి వచ్చిన వినతులు మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్ సూచనలు పరిగణలోకి తీసుకుని అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

– గ్రంథాల వాసుదేవరావు, మండల ఇంజనీరు, కాకినాడ రూరల్

అపరాలతో అదనపు ఆదాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌కుమార్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అపరాల సాగుతో రైతుకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా వ్యవసాయశాధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. కాకినాడ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు అపరాలు, పచ్చిరొట్టసాగుపై శనివారం అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అపరాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి రైతు సమాచారం గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద ఉండాలన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు, డ్రోన్లు, రైతు గ్రూపుల ఏర్పాటు చేయడం, పీఎం కేవైసీ తదతర అంశాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ జీవీ పద్మశ్రీ, ఏఓలు సత్యనారాయణ, ఐ.సత్య, టీవీఆర్ మణిదీప్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత. వేదికపై ఉన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివ ప్రసన్న తదితరులు

- ఎంపీ వంగా గీత
- ఘనంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు



సభకు హాజరైన మహిళలు

కాకినాడ: మహిళల సంక్షేమానికి ఎన్నో వినూత్న పథకాలను సీఎం అమలు చేస్తున్నారని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. స్థానిక 32 డివిజన్ రామకృష్ణారావుపేట, 29వ డివిజన్ సూర్యనారాయణ పురం ప్రాంతాల్లో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీతో పాటు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఏడీసీ నాగ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, నాయకులు కార్యకర్తలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ గీత మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో రూ.100 కోట్ల బకాయిగాను, ఇప్పటి వరకు మూడు విడతల్లో ముఖ్యమంత్రి రూ.75 కోట్లు తిరిగి చెల్లించారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత, అభివృద్ధి, సంక్షేమం, రిజర్వేషన్లు, పదవుల్లో ప్రాధాన్యం సహా అన్నింటా అగ్రస్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మాటకు కట్టుబడి పని చేసే ఇలాంటి సీఎం వద్ద పనిచేసే అవకాశం దక్కడం తాము అదృష్టంగా భావిస్తున్నామని ద్వారంపూడి పేర్కొన్నారు.

ఇటువంటి ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన మహిళలకు విజ్ఞప్తి చేశారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి మాట్లాడుతూ మహిళలను ఉన్నత స్థానంలో నిలబెట్టిన సీఎంకు అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో 'నేను ఉన్నాను –నేను విన్నాను' అంటూ భరోసా ఇచ్చిన సీఎం ఆడిన మాట తప్పకుండా ప్రతి విషయంలో మహిళలకు ప్రత్యేక గౌరవం కల్పించారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడో విడత సిటీ పరిధిలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సుమారు రూ.25 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీపీఆర్ఓ మానే కృష్ణ మోహన్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్ కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, రోకళ్ల సత్యనారాయణ, తెహరాఖాతూన్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ఎస్ రాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరి నమ్మకం జగనన్నే

- గృహసారథులు, కన్వీనర్ల పనితీరే కీలకం
- విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు



ఎమ్మెల్యే కన్నబాబు, జెడ్పీటీసీ, ఎంపీపీలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

కరప/కాకినాడ రూరల్: పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జనరంజక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నే అందరి నమ్మకం కావాలని, ఆ దిశగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు అందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజలతో మమేకమై పనిచేయాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా శనివారం కరప మండలం నడకుదురులోని విఘ్నేశ్వరాలయం వద్ద కల్యాణ మండపంలో, రూరల్ మండలం తూరంగి, కొవ్వూరు, ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, రేపూరు, గంగనాపల్లి గ్రామాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహ సారథులతో చీడిగ గ్రామంలోని నాగం సీతామహాలక్ష్మి కల్యాణ మండపంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా పనిచేయాలని వారికి సూచించారు. మీపై నమ్మకాన్ని వమ్ముచేయకుండా అందరినీ సమన్వయం చేసుకుంటూ, ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు, సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకోవాలని, అర్హులైతే ఆ పథకాలు అందేలా చూడాలన్నారు. అదే సమయంలో చంద్రబాబు మోసపూరిత పాలన తీరు ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో 96 శాతం అమలుచేసిన తీరును వివరించి, జగనన్నపై నమ్మకం కల్గించాల్సిన బాధ్యత మనపై ఉందని కన్నబాబు అన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీని, సీఎంగా జగన్‌ను గెలిపించేందుకు సైనికుల్లా పని చేయాలని ఆయన కోరారు. కరప మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు మండల గృహసారధులు, సచివాలయ కన్వీనర్లతో కల్సి ఎమ్మెల్యే కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిలను గజమాలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సర్పంచ్ దేగల లలితకుమారి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పైలా రామతులసి, గోవిందు, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, ముమ్మిడి బుచ్చిబాబు, పెంకే సత్తిబాబు, జవ్వాది సతీష్, యడ్ల కృష్ణార్జున, పోతల లోవప్రసాద్ వివిధగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రూరల్ మండల సమావేశంలో సీనియర్ నాయకుడు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, గోపిశెట్టి బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ అనుసూరి ప్రభాకర్, హితకారిణి సమాజం డైరెక్టర్ అరుణ, రేపూరు సర్పంచ్ నక్కా వీరన్న, కొవ్వాడ ఉప సర్పంచ్ తోటకూర శ్రీను, గంగనాపల్లి ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, పల్లం రాజు, జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రూరల్ మండలంలో హాజరైన గృహసారథులు, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు

శ్రీకిరణ్‌కు యూబీఎం అందజేత

- సామాజిక బాధ్యతగా కాకినాడ సీ పోర్టు వితరణ
- డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించిన సీపోర్టు చైర్మన్ రావు
- ముఖ్య అతిథిగా హాజరైన సినీ దర్శకుడు రాఘవేంద్రరావు



నేత్ర పరికరాన్ని ప్రారంభిస్తున్న సీ పోర్టు చైర్మన్ రావు, దర్శకుడు రాఘవేంద్రరావు, డాక్టర్ చంద్రశేఖర్

కాకినాడ రూరల్: సామాజిక బాధ్యతలో భాగంగా కాకినాడ సీ పోర్టు లిమిటెడ్(కేఎస్‌పీఎల్) మండలంలోని పెనుమర్తి గ్రామంలోని శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి రూ.17.8 లక్షల విలువైన నేత్ర పరికరం యూబీఎం (అల్ట్రా సౌండ్ బయోమైక్రోస్కోపీ) ను అందజేసింది. ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు కేవీ రావు, సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరావు, పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ శనివారం నేత్ర పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీ రావు మాట్లాడుతూ శ్రీ కిరణ్ కంటి ఆస్పత్రి ద్వారా ఎందరికో కంటి వైద్య సేవలు అందిస్తున్నారని, మెరుగైన వైద్యం కోసం సీఎస్సార్ నిధులను అధునాతన యంత్రాన్ని అందించామన్నారు. సినీ దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ శ్రీకిరణ్ ఆస్పత్రిలోకి రాగానే తెలియని అనుభూతిని ఇచ్చిందన్నారు. కుటుంబ సభ్యులను ప్రమాదంలో కోల్పోయి తరువాత కోలుకుని ప్రజలకు కంటి చూపును అందించేలా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కేఎస్‌పీఎల్ సీఈఓ మురళీధర్ మాట్లాడుతూ శ్రీకిరణ్ కంటి ఆస్పత్రికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టరు చంద్రశేఖర్ మాట్లాడుతూ మెరుగైన కంటి వైద్యం కోసం అల్ట్రా సౌండ్ యంత్రం ఇవ్వడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ సీఈఓ రాజేష్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టరు అవినాష్ మహీంద్రకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టరు చంద్రశేఖర్‌ను కేవీ రావు, రాఘవేంద్రరావు తదితరులు సన్మానించారు. అలాగే అతిథులను ఫౌండేషన్ తరపున సత్కరించారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలి



మార్కెట్ కమిటీ ప్రగతిని వివరిస్తున్న కార్యదర్శి శ్రీనివాసు

కరప: మార్కెట్ ఫీజు వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేసి, కమిటీ అభివృద్ధికి సిబ్బంది పనిచేయాలని కరప వ్యవసాయమార్కెట్ కమిటీ అధ్యక్షుడు కర్నాసుల సీతారామాంజనేయులు సూచించారు. మండలం నడకుదురులోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటీ పరిధిలో కూరాడలో రూ.50 లక్షలతో చేపట్టిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ భవన నిర్మాణాన్ని సకాలయంలో పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉన్నతశ్రేణి కార్యదర్శి డి.శ్రీనివాసు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని అధిగమించి, జిల్లాలోనే ద్వితీయస్థానంలో ఉందన్నారు. 2022–23లో మార్కెట్ ఫీజు రూ 3 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ 4.08 కోట్లు వసూలు చేశామన్నారు. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ కె.వరప్రసాద్, ఎం.శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు తుమ్మలపల్లి గోవిందరాజులు, బొమ్మిడి కుమారి, బొమ్మిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పిస్తానని పంచేసుకున్నారు..

- కలెక్టరేట్ వద్ద జగ్గంపేట మండలం మల్లిపాక రైతుల ఆందోళన

కాకినాడ సిటీ: పట్టాలిప్పిస్తానని రెండు వందల మంది రైతులను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు కోరుతూ జగ్గంపేట మండలం మల్లిపాక గ్రామ రైతులు, ప్రజలు శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. వందల ఏళ్లగా సాగు చేసుకుంటున్నా భూమికి హక్కులు కల్పించి పట్టాలు ఇప్పిస్తానని అదే గ్రామానికి చెందిన సాకా కృష్ణారావు 200 మంది రైతుల నుంచి రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేశాడన్నారు. ఆ సొమ్ముతో ఆ భూమిని తన పేరు మీద, మరికొంత భూమిని కర్నూలుకు చెందిన మునిగేరు మదన్‌మోహన్ పేరుతో పట్టాలు పొంది పట్టాదారు పాస్ పుస్తకం టైటిల్ డీడ్ వంటి రెవెన్యూ హక్కులు పొంది తోటి రైతులను మోసం చేశాడన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కరప: స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనర్‌ను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ నౌడు రామకృష్ణ కథనం మేరకు మండలం వేములవాడ గ్రామానికి చెందిన బాలిక కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటోంది. రోజూ కళాశాలకు వెళ్లి, వచ్చే సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు అనుసరిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు బాలిక తన ఇంటివద్ద సాధారణ బాత్‌రూమ్‌కు వెళ్లింది. అదే సమయంలో నిందితుడు బాత్‌రూమ్ పై నుంచి ఫొటోలు తీయడాన్ని గమనించి, వెంటనే దుస్తులు ధరించి, తలుపులు తెరవగా పారిపోయాడు. నిందితుడిపై చర్య తీసుకోవాలని కోరుతూ బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు.

ముగ్గురికి కోవిడ్ నిర్ధారణ

కాకినాడ క్రైం: జిల్లాలో మరో ముగ్గురికి కోవిడ్ నిర్ధారణ అయింది. శుక్రవారం సేకరించిన 68 నమూనాలను పరీక్షించగా ఈ ఫలితం వెల్లడైంది. పెదపూడికి చెందిన ఏడేళ్ల బాలిక, 12 ఏళ్ల బాలుడు, 34 ఏళ్ల వివాహిత కోవిడ్ బారిన పడిన వారిలో ఉన్నారు. వీరిని హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. తాజా కేసులతో ఈ వారంలో జిల్లాలో కోవిడ్ బారిన పడిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది.

ధ్యానంతో ఒత్తిడి దూరం

కాకినాడ రూరల్: ధ్యానంతో రోజును ప్రారంభిస్తే మిగిలిన పనులన్నీ ఏ ఒత్తిడీ లేకుండా సాగిపోతాయని పిరమిడ్ ధ్యాన శిక్షకులు మణికుమార్ పేర్కొన్నారు. స్థానిక శాంతి ఆశ్రమంలో శ్రీ విశ్వ శాంతి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. విచారం, బాధ, ఒత్తిడి, అశాంతి వంటి మనో రుగ్మతలను నియంత్రించడానికి ధ్యానం పరమౌషధమని మణికుమార్ తెలిపారు.

విశాఖ ఉక్కును విక్రయించొద్దు



ధర్నా నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాలు

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమానికి శనివారంతో 700 రోజులు పూర్తయిన సందర్భంగా కేంద్ర కార్మిక సంఘాలు శనివారం కాకినాడలోని పూలే విగ్రహం వద్ద ధర్నా చేశాయి. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్‌లు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇతర స్టీల్ ప్లాంట్ లాగే సొంత గనులు సమకూర్చి ప్రభుత్వ ఆధీనంలోనే ప్లాంట్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికసంఘాల నాయకులు తాళ్లూరి రాజు, దువ్వా శేషుబాబ్జీ, పలివెల వీరబాబు, ఎం యేసు, గదులసాయిబాబా, బంగారు సత్యనారాయణ, పిఎస్ నారాయణ, పెద్దిరెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యవార్ల కల్యాణం



వేదికపై కొలువుదీరిన అమ్మవారు, అయ్యవారు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వసంత నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీజ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలుత స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.